
మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

డంపింగ్‌యార్డు తొలగింపునకు సంపూర్ణ మద్దతు

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

మడికొండ, మార్చి 5 : డంపింగ్ యార్డు తొలగించేందుకు ప్రజలు చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. మడికొండ శివారులోని డంపింగ్‌యార్డు ఎత్తివేయాలని కోరుతూ బుధవారం ఆయనతో పాటు రాష్ట్ర ఆయిల్ సీడ్స్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డిని డంపింగ్‌యార్డు తొలగింపు అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డును తక్షణమే ఎత్తివేయాలని, తాము అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిలపక్షం తరపున మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ మాట్లాడుతూ.. మడికొండ డంపింగ్ యార్డు సమస్యపై చాలాసార్లు కౌన్సిల్‌లో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, 15 సంవత్సరాల నుంచి మడికొండతో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజలు యార్డు నుంచి వెలువడే కాలుష్యం, విష వాయువులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దాస్యం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి కేటీఆర్ రూ.37 కోట్లతో బయోమైనింగ్ మిషన్లు తెప్పించారన్నారు. సమస్య శాశ్వతంగా పరిష్కరించే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, అడ్‌హక్ కమిటీ సభ్యులు తౌటిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పెండ్లి కృష్ణమూర్తి, తాడూరి మోహన్, పొనగోటి వెంకట్‌రావు, దువ్వ నవీన్, బొల్లికొండ వినోద్ తదితరులు ఉన్నారు.

మురుగు కాల్వల్లో చెత్త తొలగించరా?

అధికారులపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అసహనం

బ్రిడ్జి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ చౌరస్తా, మార్చి 5 : మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్త తొలంచకపోవడంపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన 8వ డివిజన్ ఇందిరానగర్, టైలర్‌స్ట్రీట్‌లో పర్యటించారు. డ్రైనేజీల్లో ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంపై అధికారులపై సీరియస్ అయ్యారు. అనంతరం హనుమకొండ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి స్థానిక దుకాణ సముదాయాల యాజమానులకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన చేపడుతామని చెప్పారు. అలంకార్ రోడ్డుపై నిర్మిస్తున్న డ్రైనేజీ బ్రిడ్జి పనుల్లో జాప్యం జరిగితే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఐదుగురికి సామాజిక సేవ శిక్ష

కాజీపేట, మార్చి 5 : మద్యం తాగి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి న్యాయమూర్తి సామాజిక సేవ శిక్ష విధించారు. బుధవారం ట్రాఫిక్ సీఐ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటలోని ముఖ్య కూడళ్లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడినట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. కోర్టు కానిస్టేబుల్ కుమార్ కలకోట్ల కల్యాణ్, గోవింద రాజు, గన్నారపు శివకుమార్, కన్నెబోయిన నాగరాజు, జరుపుల బాబును రెండో తరగతి కోర్టు న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి ఎదుట హాజరుపర్చగా, వీరికి రెండు రోజులు సామాజక సేవ చేయాలని తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. ఐదుగురిని కాజీపేట సర్కిల్ మున్సిపల్ కమిషనర్ ఎదుట హాజరుపర్చామన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

పరకాల, మార్చి 5 : పట్టణంలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ చెల్పూరి వెంకటేశ్ పేర్కొన్నారు. పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధిలో పన్నుల వసూళ్లు ఎంతో కీలకమన్నారు. ప్రజలు పన్ను బకాయిలు చెల్లించి పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 97 శాతం హాజరు

- ఒక విద్యార్థి డిబార్
- పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన సీపీ అంబర్ కిశోర్ ఝా, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మార్చి 5 : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 97 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 20,546 మందికి మొదటి పేపర్ తెలుగు, సంస్కృత పరీక్ష 19,872 మంది రాశారు. మొత్తం 673 గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి గోపాల్ తెలిపారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఒకరు మాల్ ప్రాక్టీసింగ్ చేస్తుండగా, డిబార్ చేసినట్లు చెప్పారు.

సుబేదారి : నయీంనగర్‌లో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

ఇంటర్ పరీక్షా కేంద్రాల తనిఖీ..

సుబేదారి/హనుమకొండ : నగరంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలను పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తనిఖీ చేశారు. నయీంనగర్‌లోని ప్రైవేట్ జూనియర్ కళాశాల, హనుమకొండ చౌరస్తాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వరంగల్ ఎల్‌బీ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. వడ్డేపల్లిలోని ఎస్సార్ జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సబ్‌సెంటర్లను పరిశీలించిన డీఎంహెచ్‌వో

ధర్మసాగర్ : నారాయణగిరి సబ్‌సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ధర్మసాగర్/వేలేరు/వరంగల్ చౌరస్తా, మార్చి 5 : ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి సబ్ సెంటర్, వేలేరు, పీచర, ఎర్రబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో అప్పయ్య బుధవారం పరిశీలించారు. సెంటర్ల ద్వారా ప్రజలకు అందజేస్తున్న సేవలను ఏఎన్ ఎంలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు నెల వారీగా పరీక్షలు చేసి క్రమం తప్పకుండా మందులు అందజేయాలని తెలిపారు. 5సంవత్సరాల్లోపు పిల్లలకు టీకాలు వేస్తున్నారా? అని ఆరా తీశారు. వారంలో బుధ, శనివారం పిల్లలకు టీకాలు వేస్తామని ఏఎన్ఎం సుమతి తెలిపారు. వేసవిలో ప్రజలకు తగు సూచనలు చేయాలన్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి చేసిన బీపీ, షుగర్, రే స్క్రీనింగ్ పరీక్షల వివరాలపై అధికారులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. అలాగే హనుమకొండలోని పలు హాస్పిటళ్లు, డయాగ్నస్టిక్ సెంటర్లను తనిఖీ చేశారు. చట్ట వ్యతిరేక లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. ధర్మసాగర్, వేలేరు పీహెచ్‌సీల వైద్యాధికారులు గోపీనాథ్, మేఘన, పీడీఎంవో భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు రామ్మోహన్‌రావు, రామ్మోహనరావు, రమాదేవి, మొదటి ఏఎన్ఎంలు సుమతి, రజిత, సెకండ్ ఏఎన్ఎం స్వప్న ఉన్నారు.

నేటి నుంచి బల్లార్షా ఎక్స్‌ప్రెస్ రైలు షురూ

కాజీపేట, మార్చి 5 : కాజీపేట-బల్లార్షా మధ్య ప్రతిరోజూ రాకపోకలు సాగించే బల్లార్షా ఎక్స్‌ప్రెస్ రైలును గురువారం నుంచి తిరిగి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సెక్షన్‌లో జరుగుతున్న మూడో లైన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల వల్ల రైల్వే అధికారులు ఈ రైలును రద్దు చేశారు. కాగా, ప్రయాణికుల అభ్యర్థన మేరకు ఉన్నతాధికారులు తిరిగి నడిపించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 6న రాత్రి 10.50 గంటలకు కాజీపేటలో బయలుదేరి 7న ఉదయం 3.10 గంటలకు బల్లార్షా చేరుకుంటుందన్నారు. బల్లార్షా నుంచి 7న ఉదయం 3.40గంటలకు బయలుదేరి కాజీపేటకు ఉదయం 8.50 గంటలకు చేరుకుంటుందని తెలిపారు.

విద్యార్థికి న్యాయం చేయాలని స్కూల్ బస్సు అడ్డగింత

ఎల్కతుర్తి, మార్చి 5 : పాఠశాలలో క్రీడలు ఆడుతున్న విద్యార్థి గాయపడగా, అతడికి న్యాయం చేయాలని తల్లిదండ్రులు దామెర గ్రామంలో పాఠశాల స్కూల్ బస్సును బుధవారం అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దామెర గ్రామానికి చెందిన అల్లెపు శ్రీను కుమారుడు అంజి మండల కేంద్రంలోని ఆల్టిట్యూడ్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో గత నెల కబడ్డీ పోటీలు నిర్వహించగా, అంజి తీవ్రంగా గాయపడ్డాడు. కొద్ది రోజుల తర్వాత జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పగా, పలు ఆస్పత్రులో చికిత్స చేయించారు. చివరికు అంజికి ఆపరేషన్ కూడా చేయించారు. ఈ విషయాన్ని పాఠశాల యాజమాన్యం దృష్టికి విద్యార్థి తల్లిదండ్రులు తీసుకెళ్లగా, అయిన ఖర్చు భరిస్తామని హామీ ఇచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అయితే కొద్ది మేరకే సహాయం చేసిన పాఠశాల యాజమాన్యం చివరకు స్పందించలేదు. దీంతో గ్రామానికి వచ్చిన పాఠశాల బస్సులను విద్యార్థి తల్లిదండ్రులతో పాటు పలువురు అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడ్డ విద్యార్థికి ఇచ్చిన హామీ మేరకు సహాయం అందించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

కేయూ దూరవిద్య పీజీ పరీక్షలో 27 మంది డిబార్

హనుమకొండ చౌరస్తా, మార్చి 5 : కాకతీయ విశ్వవిద్యాలయ దూర విద్య పీజీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఏఎస్ఎం కాలేజీలో పరీక్షల తీరు తెన్నులను అదనపు పరీక్షల నియంత్రణాధికారులు పద్మజ, సౌజన్య, మేఘనారావుతో కలిసి ఆయన పర్యవేక్షించారు. విశ్వవిద్యాలయ విద్యా కళాశాల పరీక్షా కేంద్రంలో 16 మంది, సీకేఎం కాలేజీలో 10 మంది, ఎల్బీ కాలేజీలో ఒకరిని మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ చేశామన్నారు.

అక్రమ నిర్మాణాలపై బల్దియా కొరడా

వరంగల్, మార్చి 5 : అక్రమ నిర్మాణాలపై గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అధికారులు కొరడా ఝుళిపించారు. హంటర్ రోడ్డులోని సర్వేనంబర్ 125సీలోని స్థలంపై ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ, మంద జ్యోతి, ఇద్దయ్యకు నగరానికి చెందిన నంబూరి చారుమతి మధ్య వివాదం నడుస్తున్నది. తమ స్థలంలోని 400 గజాలను ఆక్రమించి నిర్మాణం చేపట్టారని చారుమతి హైకోర్టులో కేసు వేశారు. దీనిపై విచారించిన హైకోర్టు మంద కృష్ణ చేపట్టిన ఆక్రమ నిర్మాణాలను తొలగించాలని గ్రేటర్ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు జనవరిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు. అలాగే మంద కృష్ణ మాదిగ తమకు సంబంధించిన స్థలంలో చారుమతి అక్రమ నిర్మాణాలు చేపట్టారని హైకోర్టును ఆశ్రయించారు. దీని

హంటర్ రోడ్డులోని అక్రమ నిర్మాణం తొలగిస్తున్న గ్రేటర్ అధికారులు

పై విచారణ జరిపిన కోర్టు చారుమతి చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని గ్రేటర్ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే నంబర్ 125సీలోని చారుమతికి చెందిన అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రహరీతో పాటు రేకుల గదిని కూల్చివేశారు.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనపై సమీక్షిస్తున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మార్చి 5 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో పురోగతి సాధించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్‌లో ఆమె టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు కాజీపేట, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వార్డు అధికారులు ప్రతి రోజు 50 దరఖాస్తులు పరిశీలించాలన్నారు. ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కోసం సర్వేయర్ల సేవలు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీంద్ర రాడేకర్, ఏసీపీ రజిత, నస్రీన్, ఖలీల్, శ్రీనివాస్‌రెడ్డి, ఇర్షాద్ పాల్గొన్నారు.

వర్గీకరణతోనే ఎస్సీ ఉపకులాలకు లబ్ధి

పరకాల, మార్చి 5 : ఏబీసీడీ వర్గీకరణతోనే ఎస్సీ ఉపకులాలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ అన్నారు. మండలంలోని వెల్లంపల్లిలో దప్పు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏ, బీ, సీ వర్గీకరణతో ఎస్సీ ఉపకులాలు తీవ్రంగా నష్టపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఉపకులాలను ఏబీసీడీలుగా వర్గీకరించి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పెండేల మహేందర్, పెండేల సురేశ్, కృష్ణ, రవీందర్, శోభన్ పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

దామెర, మార్చి 5 : మండలంలోని ఓగులాపురం, దమ్మన్నపేట ఉపాధిహామీ పనులతో పాటు పసరగొండ గ్రామంలోని రెండు చెక్‌డ్యాం స్థలాలను జిల్లా ఎస్క్యూసీవో పుష్పలత, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూలీలకు పనులను కల్పించడంతోపాటు సరైన కూలి వచ్చేలా చూడాలని, పని ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విమల, ఏపీవో శారద పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కమలాపూర్, మార్చి 5 : మండలంలోని ఉప్పల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం నాయకులు ప్రారంభించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎంపీ నిధుల నుండి సీసీ రోడ్డు నిర్మాణానికి 30లక్షల నిధులు కెటాయించారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మొదలు పెట్టారు. గ్రామాభివృద్ధికి నిధులు కెటాయించిన సంజయ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ర్యాకం శ్రీనివాస్, తోట సురేష్, బండారి సుధాకర్, ఎర్రబెల్లి దేవేందర్‌రావు, ర్యాకం మొండయ్య, నవీన్‌కుమార్, చిట్టి సుందరయ్య, దండే వేన శ్రీనివాస్, బండి సంపత్, ఎర్రబెల్లి సంపత్‌రావు, పోతిరెడ్డి శంకర్ తదితరులున్నారు.

మల్లికాంబ మనోవికాస కేంద్రం సందర్శన

హనుమకొండ, మార్చి 5 : హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రాన్ని బుధవారం మామూనూరు 4వ బెటాలియన్ ఉద్యోగులు సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ రామ్‌ప్రకాశ్, అడిషనల్ కమాండెంట్ సురేశ్ ఆదేశాల మేరకు యాన్యువల్ రిఫ్రెషర్ కోర్స్‌లో భాగంగా ఎఫ్ కంపెనీ అధికారులు, సిబ్బంది మల్లికాంబ కేంద్రం సందర్శించి నిత్యావసర వస్తువులు, పండ్లు, బియ్యం అందిజేశారు. కార్యక్రమంలో ఎఫ్ కంపెనీ ఆర్ఐ పురుషోత్తం రెడ్డి, ఆర్ఎస్సైలు ప్రశాంత్, రుషికేష్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలి

శాయంపేట, మార్చి 5 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ అన్నారు. నూర్జహాన్‌పల్లిలో శివ ఆధ్వర్యంలో 'పల్లె పలకరింపు యాత్ర' కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. సమ్మయ్య, రాజునాయక్, కిషన్‌రావు, సుభాష్, రియాజ్, సాంబమూర్తి, శ్రీను, రాజేందర్ పాల్గొన్నారు.

వెయ్యిస్తంభాల గుడి శివరాత్రి ఆదాయం రూ.22లక్షలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 5 : చారిత్రక వెయ్యిస్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన హుండీలు లెక్కించారు. హుండీల ద్వారా రూ.8,21,800, అలాగే పూజా రుసుముల ద్వారా రూ.7,20,000, విరాళాల ద్వారా రూ.6,60,000 మొత్తం రూ.22,01,800 సమకూరింది. గత సంవత్సరం కంటే రూ.6,50,000 ఆదాయం ఎక్కువగా సమకూరిందని ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామల సునీత, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

ఆర్ట్స్ కాలేజీలో సైక్లింగ్ పోటీలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 5 : కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన సైక్లింగ్ (పురుషుల) పోటీలను క్రీడా కార్యదర్శి వెంకయ్య సమక్షంలో వీసీ ప్రతాప్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీకి చెందిన మహ్మద్ హబీబుద్దీన్, హనుమకొండ అరుణోదయ కాలేజీకి చెందిన రాకేశ్, మాస్టర్ జీ కాలేజీకి చెందిన మహ్మద్ రియాజ్, కిట్స్ కాలేజీకి చెందిన సంజీవ్, లోకేశ్, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన రాజకృష్ణ ఎంపికయ్యారని, వీరు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని వెంకయ్య తెలిపారు.

అకుట్ అధ్యక్షుడిగా వెంకట్రాంరెడ్డి

నియామకపత్రం అందజేస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్

హనుమకొండ చౌరస్తా, మార్చి 4 : కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం(అకుట్) అధ్యక్షుడిగా వెంకట్రాంరెడ్డి ఎన్నికయ్యారు. అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలు మంగళవారం కేయూ పరిపాలనా భవనం, కొత్తగూడెంలో నిర్వహించారు. మొత్తం 77 మందికి 75 మంది అధ్యాపకులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. బుధవారం ఓట్లు లెక్కించారు. అధ్యక్షుడిగా వెంకట్రాంరెడ్డి, కార్యదర్శిగా ఎల్పీ రాజ్‌కుమార్ ఎన్నికైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్, సహాయ రిజిస్ట్రార్ ప్రణయ్‌కుమార్ తెలిపారు. వైస్ ప్రెసిడెంట్‌గా సవితాజ్యోత్స్న, సంయుక్త కార్యదర్శిగా రాము, కోశాధికారిగా రమేశ్, ఈసీ మెంబర్లుగా స్వర్ణలత, వెంకటయ్య, షాయెద, సుమలత, వేణుగోపాల్‌రెడ్డి, జ్యోతి, వరలక్ష్మి, హరికృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలి

యూత్ పార్లమెంట్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మార్చి 5 : దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని కాకతీయ విశ్వవిద్యాలయ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూలో నేషనల్ యూత్ పార్లమెంట్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత తమ మేధాశక్తిని ఉపయోగించి దేశాన్ని ప్రపంచస్థాయిలో ముందుకు తీసుకెళ్లేలా కృషి చేయాలని సూచించారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువత అందరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, ముందుగా మై భారత్ పోర్టల్‌లో 9లోగా రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రాంచంద్రం, ప్రిన్సిపాల్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ మమత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాధిక, సుజాత, సునీత పాల్గొన్నారు.

విద్యా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మనోహర్..

కాకతీయ విశ్వవిద్యాలయ విద్యా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ మనోహర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు అందజేశారు. పలువురు ఆయనను అభినందించారు.

కెరీర్ కౌన్సెలింగ్ సెల్ ఆఫీసర్ల నియామకం

హనుమకొండ చౌరస్తా, మార్చి 5 : కాకతీయ విశ్వవిద్యాలయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్, కెరీర్ కౌన్సెలింగ్ సెల్ ఆఫీసర్‌గా కళాశాల సీఎస్ఈ విభాగ ఒప్పంద అధ్యాపకుడు బొల్లం కిరణ్‌కుమార్, అలాగే ఇంజినీరింగ్ కళాశాల (కోఎడ్యుకేషన్) ప్లేస్‌మెంట్, కెరీర్ కౌన్సెలింగ్ సెల్ ఆఫీసర్‌గా కళాశాల సీఎస్ఈ విభాగ ఒప్పంద అధ్యాపకుడు రమణబాబును నియమిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఈ పదవిలో సంవత్సరం పాటు ఉంటారు.

సరైన పరీక్ష కేంద్రానికి విద్యార్థి తరలింపు

మడికొండ, మార్చి 5 : ఇంటర్ పరీక్ష రాసేందుకు మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు విద్యార్థి బాలాజీ చేరుకున్నాడు. అయితే కాజీపేటలో ఉన్న క్షేత్ర జూనియర్ కళాశాలకు వెళ్లాల్సి ఉండగా, మడికొండకు రావడంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్ సమయం లేకపోవడంతో హెడ్ కానిస్టేబుల్ రాంచందర్ బైకుపై సకాలంలో తరలించారు.

16న స్టేషన్‌ఘన్‌పూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 5 : ఈ నెల 16న సీఎం రేవంత్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్‌కు రానున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. రూ.800 కోట్లతో వంద పడకల ఆస్పత్రి, డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, డిగ్రీ కాలేజ్, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి నవాబ్‌పేట వరకు కెనాల్ సీసీ లైనింగ్, రూ.4కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లు, మూడు సబ్ స్టేషన్లు, డీఈ ఆఫీస్, బంజారా భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ధర్మసాగర్ మండలం రాయగూడెంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తారని, ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. అనంతరం బహిరంగ సభలో సీఎం మాట్లాడుతారని తెలిపారు.

మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం!

శాయంపేట, మార్చి 5: గోవిందాపూర్ మాజీ సర్పంచ్ చింతని ప్పుల భద్రయ్యపై బుధవారం రాత్రి హత్యాయత్నం జరిగింది. గొడ్డలితో ఒకరు దాడి చేయగా, భద్రయ్య భుజానికి గాయమైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉంది.

అనితారెడ్డికి ఐడియల్ ఉమెన్ అవార్డు

అవార్డు అందుకుంటున్న అనితారెడ్డి

హనుమకొండ, మార్చి 5 : అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలక మండలి సభ్యురాలు, వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి ఐడియల్ ఉమెన్-2025 అవార్డు అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ హైదరాబాద్ పాతనగర కవుల వేదిక ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అనితారెడ్డికి మేమిరెడ్డి నర్సింహారెడ్డి, ప్రముఖ కవి కోరుప్రోలు హరినాథ్, డాక్టర్ నాగేశ్వరం శంకరం అవార్డు అందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

దామెర, మార్చి 5 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనీ ఐపీఎస్ మనన్‌భట్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తమ బ్యాంకుల సమాచారం ఎవరికీ తెలియజ